
**నాకెప్పుడూ మనసులో ఒక కోరిక మెదులుతూ వుంటుంది. నేను కోల్పోయిన నా చిన్ననాటి స్వేచ్ఛను తిరిగి పొందాలని. ఈ పెద్దరికం మాయాజాలం నుంచి నన్ను నేను బయట పడవేసుకోవాలని.**

**నా ఉద్యోగము, సంఘంలో హోదా నన్ను "పెద్దరికపు ముసుగులో బంధించి వేసింది" గూడులో చిక్కుకున్న సాలె పురుగు మాదిరిగా దానిలో నుంచి బయట పడాలని ఆరాటం. ఇప్పటికి అది సాధ్యమవుతుందని ఆనందం!**

ఈ వారం కథ

# కనిపించని కొరడా

— అన్నవరపు శ్రీను



నావన్నీ చాలా చాలా చిన్న కోరికలు. చెప్పేస్తే నిజంగా నవ్వుకుంటారేమో! నవ్వుకుని, రిటైరయిన ఈ వయసులో నీకివేం కోరికలయ్యా అని కూడా అంటారేమో! అనుకోనీ. అందులో వున్న ఆనందం వాళ్ళకేం తెలుసు. "మేము పెద్దవాళ్ళం. బరువులు, బాధ్యతలు మోస్తున్నాం. సమాజాన్ని నడిపించేస్తున్నాము అన్న ఒకి బూటకం తప్ప"

మా వీధిలో పిల్లలతో గోలీలాడాలని, కర్రా-బిళ్ళా ఆడాలని, వాళ్ళతో కాలవకూ వెళ్ళి ఈదులాడాలని, వాళ్ళ స్వేచ్ఛలో నా "ముసుగుని" తీసేసుకోవాలని ఒకటే కోరిక.

ఒకరోజు మా వీధి పిల్లలంతా ఆడుకునే చోటికి వెళ్ళాను. నన్ను వాళ్ళు పెద్దగా పట్టించుకోలేదు. పైగా నా వంక అనుమానంగా చూసేశారు. నావల్ల పెద్ద ప్రమాదం లేదు అనుకున్నారేమో వాళ్ళ మానాన వాళ్ళు ఆడుకుంటూనే వున్నారు.

వాళ్ళలో ఒకడిని పిలిచాను "ఇలారారా బాబు" అని. వాడు "ఏమిటి" అని సీరియస్‌గా అడిగాడు. ఆట మధ్యలో పిలిచాను అన్న కోపంతో. వాడిని కాస్త మంచి చేసుకుని "ఒరేయ్ నేను మీతో కర్రాబిళ్ళ ఆడతానురా" అన్నా. అంతే వాడు ఒక్కసారిగా ఆశ్చర్యపోయి మిగతా పిల్లల్ని ఉద్దేశించి "ఒరేయ్ ఈ పెద్దాయన మనతో ఆడతాడంట రా" అని వాళ్ళతో చెప్పాడు. పిల్లలంతా కలసి "ఆ నువ్వు పెద్దోడివి మాతో ఆడగూడదు" అనేశారు. నేను వాళ్ళని బుజ్జగించి "ఫర్వాలేదురా నేను ఆడతాగా" అని అన్నా. వాళ్ళకు తమాషాగా అనిపించింది. ఒప్పుకున్నారు.

ఒక పిల్లాడు నాకు కర్ర ఇచ్చాడు. అది నా చేతిలోకి రాగానే నేను కోల్పోయిన "స్వేచ్ఛ"లోకి వెళ్ళిన అనుభూతి పొందాను. పైగా ఇది నాకు ఇష్టమైన ఆట. ఒక్కసారి బలంగా ఊపిరి పీల్చుకున్నా. బిళ్ళ చివర కర్రను తాకించి గాలిలోకి లేపి, బిళ్ళను కర్రతో బలంగా కొట్టాను. అది 'సయ్' మనే శబ్దంతో గాలిలోకి దూసుకుపోయింది. ఊపిరి నిదానంగా వదిలి అర్ధనిమీలిత నేత్రుడనై ఆనందాన్ని అనుభవిస్తూ నుంచున్నా.

ఇంతలో పిల్లలంతా గోలచేస్తూ నా దగ్గరకు వచ్చేశారు. "ఏమైందిరా" అని అడిగా. వాళ్ళు సమాధానం చెప్పేలోపే ఒక నడి వయసామె "రయ్" మని నా మీదకు వచ్చేసింది. నేను బిత్తరపోయాను. "ఏమయ్యా బుద్ధుందా! పిల్లలను ఆడొద్దని చెప్పాలి గాని పెద్దోడివి నువ్వే ఆడుతున్నావంటయ్యా, అయినా ఈ వయసులో నీకిదేం పోయేకాలమయ్యా" అని దులిపేసింది. అసలు విషయమేమంటే నేను కొట్టిన బిళ్ళ ఆమె వీపు మీద గట్టిగా తగిలిందట.

నేను పిల్లల వంక చూశాను. వాళ్ళు ఇవన్నీ మనకు మామూలే అన్నట్టుగా, ఆమె వెళ్ళగానే ఆటలో పడిపోయారు. నన్ను ఆడమన్నారు గానీ నాకు మూడ్ పాడైపోయింది.

పిల్లలను "ఆడవద్దు" అని చెప్పకుండా, విసుగ్గా ఇంటిదారిపట్టా. గుమ్మంలో నా (యజమాని) ధర్మపత్ని కోపంగా చూస్తూ నిలుచునుంది.

నిజంగా చిన్నప్పుడు ఆడుకుని ఇంటికి వెళితే "నాన్న" చూసినట్లుగా.

** ** **

మా నాన్న చండశాసనుడు. నేను ఆడుతున్నాను అని తెలిస్తే ఆయన యముడైపోతాడు. రాత్రికి రాత్రి నేను గొప్ప ప్రయోజకుడినై రెండు చేతులా వీలైతే రెండు కాళ్ళతోనూ సంపాదించెయ్యాలని ఆయన కోరిక. అందుకనే రాత్రిళ్ళు కూడా చదవమని హింసించేవాడు.

ఓసారి ఏం జరిగిందంటే నాకప్పుడు పదమూడేళ్ళో, పద్నాలుగేళ్ళో అనుకుంటా.

మా నాన్న పనికెళ్ళి తిరిగి వచ్చేటైముకి ఎక్కడ ఆడుకుంటూ వున్నా టక్కున ఇంటిలో హాజరయి పోయేవాడిని. ఆ రోజు నా "నసీబు" అడ్డం తిరిగిపోయింది. బడికి ఆ రోజు ఎందుకో శలవిచ్చారు. బడి నుంచి పరిగెత్తుకుని ఇంటికి వచ్చి పుస్తకాల సంచిని గిరాటేసి, గోలీలను తీసుకుని, "ఎక్కడికి వెళుతున్నావురా" అని అమ్మ కేకేస్తున్నా వినిపించుకోకుండా బయటికొచ్చేశాను. ఆకలి "టైము" అన్నీ మరచిపోయి స్నేహితులతో ఆడుతూనే వున్నాను. చాలా గోలీలు గెలిచాను కూడా. రెండు జేబులు నిండి పోయాయి.

ఇంతలో ఒకడు "ప్..ప్..రేయ్ ప్రకాశం, ప్రకాశం" అని నెమ్మదిగా పిలుస్తూ వున్నాడు. నేను వినిపించుకోలా. "ఒరేయ్ ప్రకాశం మీ నాన్న వస్తున్నాడురా" అని గట్టిగా కేకేసి వాడు పారిపోయాడు. మిగతా వాళ్ళకూడా. నేను ఒక్కసారి తత్తరపడి తలపైకెత్తి చూశా. ఎదురుగా నిలబడి వున్నాడు. కోపంగా చూస్తూ నాన్న. మామూలుగా చూస్తేనే వణుకు. ఇంక కోపంగా చూస్తే...అంతే నా నిక్కరు తడిసిపోయింది.

ఒక్క ఉదుట్న పట్టుకున్నాడు గట్టిగా.

పారిపోతాననుకున్నాడేమో "స్వేచ్ఛను మింగేసిన వాళ్ళ దగ్గర, దాన్ని పొందాలంటే చాలా సాహసం కావాలి" నాకంత ధైర్యం ఎక్కడిది.

నా జేబులో వున్న గోలీలన్నీ పారబోసి "ఊ నడు" అన్నాడు. గొర్రెలా ఆయనతో ఇంటికి వెళ్ళా. నన్ను గదిలోకి తీసుకువెళ్ళి గడి బిగించేశాడు.

నా చదువు కోసం, భవిష్యత్తు కోసం ఆయన పడుతున్న కష్టాలు, చేస్తున్న త్యాగాలు అన్నీ వివరంగా చెప్పి అవన్నీ గుర్తుంచుకోవడానికి "ఇంతకు ముందు మరచిపోయే వాడినట" అవన్నీ చిన్న చిన్న దెబ్బలే- నిదానంగా ఆయన నడుముకు వున్న బెల్టుని విప్పి తీసి "సెల్‌లో పోలీసోడు దొంగను బాదినట్లుగా" బాదేశాడు. ఆ జ్ఞాపకాలు ఇప్పటికి నా ఒంటి మీద మిగిలేవున్నాయి. గది బైట నుంచి "వాడిని వదిలేయండి చిన్న పిల్లాడు" అన్న అమ్మ అరుపులు గదిలోకి శంఖం ఊదినట్టయ్యింది. ఆ రాత్రి అన్నం పెట్టనియ్యకుండా నాన్న అమ్మకు కాపలా వున్నాడు. "తండ్రులు ఎందుకంత క్రూరంగా వుంటారు'

అప్పటి నుంచి నాకిష్టమైన ఆటలన్నిటినీ "బెల్టు సాక్షిగా" మానుకున్నాను.

మా నాన్న నిజంగా నా పాలిట యముడే. ఎండాకాలం శలవల్లో కూడా నన్ను వదిలేవాడు కాదు. తరువాతి సంవత్సరం పుస్తకాలు, తెలిసిన వాళ్ళ దగ్గర నుంచి తెప్పించి మరీ చదివించేవాడు. మార్కులు బాగా రాకపోతే తాటవలిచేసేవాడు.

ఆయన "బెల్టుసాక్షిగా" చదివాను. ఉద్యోగం సంపాదించుకున్నాను. పెళ్ళి చేశారు. పిల్లల్ని కన్నాను. అమ్మా, నాన్నలను పోషించి వాళ్ళ రుణం తీర్చేసుకున్నాను. పిల్లలు పెళ్ళిళ్ళు చేసుకున్నారు. వేరే ఊళ్ళలో ఉద్యోగాలు చేస్తున్నారు.

ఇన్నాళ్ళకి రిటైరయిన తరువాత "స్వేచ్ఛ కోసం" ప్రయత్నం చేస్తున్నాను. ఆ నడివయసామె నా పాలిట హంసపాదు అయ్యింది. నన్ను తిట్టి ఊరుకోకుండా ఇంటికెళ్ళి శారదకు కూడా చెప్పేసింది.

గుమ్మంలో అడుగు పెట్టా "మీకివేం చేష్టలండి, రిటైరయినాక కృష్ణా, రామా అని ఇంట్లో కూచోక ఆటలేమిటి అనీ, ఇంటిమీదకు గొడవలు తీసుకు వస్తారేమిటండి. మనవళ్ళు, మనవరాళ్ళు పుట్టాక ఈ పనులేమిటి" అని తిట్టేసింది.

నాకు కోపమొచ్చి సీరియస్‌గా ఇంట్లోకి వెళ్ళిపోయా.

ఇంతకు ముందైతే శారదతో పోట్లాడేవాడిని. శారద "శారదమ్మ" అయ్యాక పోట్లాడటం మానేశాను. పెళ్ళయిన కొత్తలో శారద చెప్పినట్లు వినేవాడిని. పిల్లలు పుట్టాక నేను చెప్పినట్లు తను వినేది. పిల్లలు పెద్దాళ్ళయి, పెళ్ళిళ్ళయ్యి, కోడలు, అల్లుడు వచ్చాక శారద కాస్త "శారదమ్మ" అయ్యింది. అప్పటి నుంచి ఆమె మాట వినటం నాకూ అలవాటయిపోయింది.

పెళ్ళయిన కొత్తలో "మీరజాలగలరా నా యానతి" అని పాడేవాడిని. ఇప్పుడు "ఎట్లా మీరాలి నీ మాట" అని ఉడుక్కుంటూ గదిలోకి వెళ్ళి దుప్పటి ముసుగు పెట్టేశా.

"తన కోపమే తన శత్రువు" అన్న చందాన పక్క మీద దొర్లుతూ వున్నా.

హఠాత్తుగా స్ఫురించింది. శారదకు కోపం రావటానికి కారణం ఆ నడివయసామెకు తగలటమేనని. అట్లా కాకుండా ఎవడికో తగిలుంటే. నా మీద నాకే కోపమొచ్చింది. ఏమిటి ఇంతకుత్సితంగా ఆలోచిస్తున్నాను అని.

"పిల్లలతో ఆడుకోవటం నాకు సరదానో, మనవళ్ళు, మనవరాళ్ళు వస్తే ఎంత ఆనందిస్తానో" శారదకు తెలియదా.

వేసవి శలవల్లో వచ్చే మనవళ్ళు, మనవరాళ్ళు నాకు ఎడారిలో ఒయాసిస్సులు. కాని వాళ్ళు మాకు ఎండ మావులగానే మిగిలిపోయేవారు. వాళ్ళు వచ్చిన ఆనందం మున్నాళ్ళ ముచ్చటే. "తాతయ్యగారు, అమ్మమ్మగారు (నానమ్మగారు) అంటూ గౌరవాల ముసుగులో మాకు దూరంగా వుండిపోయేవారు.

ఓసారి మనవడిని పిలిచి "ఒరేయ్ నిఖిల్ నన్ను ఏరా తాతా అని పిలవరా" అన్నా. వాడు పోయి కోడలితో చెప్పేశాడు. ఆమె కోపంగా నా దగ్గరకు వచ్చి ఇటువంటి "వల్గర్ లాంగ్వేజి" పిల్లలకు నేర్పించకండి అనేసింది.

ఆ తరువాత శారద రావడం నన్ను ఓదార్చడం మామూలే.

ఆలోచనలు ఇట్లా సాగిపోతున్నాయి.

గదిలో అలికిడైంది. శారద వచ్చిందని తెలుసు. బెట్టుగా గమనించనట్టు వుండిపోయాను. నెమ్మదిగా వచ్చి మంచంపై కూర్చుంది. దుప్పటి ముసుగు గట్టిగా లాగేసింది.

నేను కోపంగా అలిగినట్టుగా శారద వంక చూశాను. "వచ్చిందమ్మా ఇంతోటి కోపం" అని "అలిగారా" అంటూ చక్కిలి గింతలు పెట్టింది. అయినా నేను గమ్మున వుండిపోయాను.

అనునయంగా చెప్పటం మొదలు పెట్టింది శారద. "ఏనండి మీ చేష్టలు చూస్తే నాకు అయోమయంగా వుంది. జామకాయలు కోసం పెరటి గోడ ఎక్కి కోయబోయారు. కాలు జారింది కదా. దేవుడుండబట్టి గండం తప్పింది. శారద కళ్ళలోకి సీరియస్‌గా చూశా. "కాస్త బెణుకుతో పోయింది. కాలు విరిగితే ఏమవును" అంది. గోడ పాచి పట్టి వుందిలే అన్నా. "మొన్నటికి మొన్న పొద్దున్నుంచి సాయంత్రం దాకా ఏ పిల్లలతోనో కలసి ఈదులాడి వచ్చారు. రాత్రంతా తుమ్ముతూనే వున్నారు" అంది. "వాళ్ళు ఈతకొడతా వుంటే ఆగలేకపోయాను" అన్నా. "రేపట్నుంచి మళ్ళీ వెళతారా" అని అడిగింది. "ఊ" అని చిన్నగా మూలిగా. "నిన్నటికి నిన్న అన్నం తినిపిస్తానాలేదా? అని తినిపించేదాకా మారాం చేశారు. ఇవాళేమో పిల్లలతో ఆటలాడి గొడవ తెచ్చారు.

"ఏనండి నాకెందుకో భయంగా వుందండి. మన పక్కింటి సుభద్రమ్మగారు కూడా ఇదేమాట అంటున్నారండి"

"ఏమని"

"అన్నయ్యగారి పరిస్థితి నాకెందుకో అనుమానంగా వుంది. ఎందుకైనా మంచిది రేపు ఆదివారం గుంటూరు దర్గాకు తీసుకెళ్ళు" అందండి.

"ఎందుకు"

"మీకు గాలి సోకిందేమోనంటుంది? నాకూ అదే భయంగా వుందండి"

"ఆ...రేపు ఆదివారమా"

కాసేపటికి నిద్ర పట్టేసింది. కమ్మని కల. కలలో "స్వేచ్ఛగా" స్నేహితులతో ఆడుతూ, పాడుతూ, త్రుళ్ళుతూ.

ఇది రేపటి నిజం!

## మూడో కన్ను

అప్పుడు
నువ్వు సూర్యుని కంట పడకుండా తిరుగుతుంటే
నేను చండ కిరణాల్లో మండేవాణ్ణి
నీకు వాన చిటపటలు దూరంగా వినిపించేవి
నేను చినుకుల్లో కూడా చెమటలు కక్కేవాణ్ణి
నువ్వు చలిచేతికి చిక్కకుండా తిరుగగలిగేవాడివి
గడ్డకట్టించే చల్లోకూడ నా రక్తం ఆవిరౌతుండేది
నా శక్తిని నరాల్లోంచి లాగి
నీకోసం సుఖాలను సృష్టించేవాణ్ణి
చెమటోడ్చే నా రెక్కలే
భోగాల ఆకాశంలో యథేచ్ఛగా ఎగరటానికి
నీకు రెక్కలయ్యేవి
ఇప్పుడు
కాలజ్ఞానం నా కళ్ళల్లోని వెలుగయ్యింది
నీకు గుండెదడ పుట్టించే ప్రశ్నలు
నా చూపుల్లో ప్రేలాడుతున్నాయి
తరతరాల నాటి నా సహనంలోంచి
మూడోకన్ను విచ్చుకుంటున్నది

— డా. ఎస్.ఆర్. వెంకటేశం

